## క్లుప్తంగా

### శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



**శావల్యాపురం:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జరుగుతున్న బాలికల బాల్‌బ్యాడ్మింటెన్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటెన్ కార్యదర్శి ఈ.శివశంకర్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 24 శిక్షణ శిబిరాన్ని ప్రారంభించగా క్రీడాకారులు శిక్షణలో మెలకువలను వివరించారు. ఈ శిక్షణ శిబిరాలు రెండు ధపాలుగా నిర్వహిస్తామని అందులో మొదట విడతలో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఈనెల 15 వరకు రెండవ విడత 30వ తేదీ వరకు గుంటూరులో రెసిడెన్షియల్ కోచింగ్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణ శిబిరాల్లో 20 మంది బాలికల క్రీడాకారులు ఉదయం 6 నుంచి 10 గంటల శిక్షణ ఇస్తామన్నారు. క్రీడాకారులు ఇలాంటి వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన శిక్షణ శిబిరాలు ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో పోటీల్లో పాల్గొని పతకాలు సాధించినట్లు పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణ మూర్తి తెలిపారు.

### నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



**నరసరావుపేట ఈస్ట్:** శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఇండోర్ స్టేడియంలో శనివారం రాత్రి నియోజకవర్గ స్థాయి పురుషుల డబుల్స్ షటిల్ బాడ్మింటెన్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్‌లో 40 సంవత్సరాలు పైబడిన విభాగంలో డి.పరమేష్, డాక్టర్ రవికుమార్ టీం ప్రథమ, సుబ్బయ్య, సి.హెచ్.శివ టీం ద్వితీయ స్థానం సాధించారు. ఓపెన్ విభాగంలో ధనుష్, బిట్టు టీం ప్రథమ, డి.కార్తీక్, చక్రీ టీం ద్వితీయ స్థానం సాధించారు.

### ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు

అధ్యక్షులుగా కొమ్మసాని, చైర్మన్‌గా శ్రీనివాససింగ్



**నరసరావుపేట:** నరసరావుపేట ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం 2024–25 ఏడాదికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆరోసారి ఏకగ్రీవంగా అధ్యక్షులుగా కొమ్మసాని కమలాకర రెడ్డిని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బొందిలి శ్రీనివాస సింగ్, ముఖ్య కార్యదర్శిగా ఆర్.బ్రహ్మయ్య, కోశాధికారిగా జి.అనిల్, గౌరవ అధ్యక్షులుగా జీపీ రంగయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎమ్. ఆంజనేయులు, ఉపాధ్యక్షులు బి.వెంకట నారాయణరావు, ఎం.మణికంఠ, గౌరవ సలహాదారులుగా వి.వేణుగోపాలరావు, సహాయ కార్యదర్శులుగా షేక్ అబ్దుల్ కరీమ్, వై. అనిల్ కుమార్, సాంకేతిక సలహాదారులుగా ఎస్. లక్ష్మీకాంత్‌ని ఎన్నుకున్నారు. అలాగే ఎగ్జిక్యూటి వ్ కమిటీ సభ్యులుగా జీఎం.చంద్రశేఖర్, సి.హెచ్.వెంకటేశ్వరరావు, డి.రాజశేఖర రెడ్డి, ఎస్.అక్షయ్‌కుమార్, టి.వెంకటేశ్వరరావు, టి.కోటిరెడ్డి, ఎస్.నుసినాగఫణీంద్ర రెడ్డి, ఎస్.నరేంద్రరెడ్డిలను ఎన్నుకున్నారు.

### పేటలో ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

**నాదెండ్ల:** చిలకలూరి పేట నియోజకవర్గ పరిధిలో మూడు రోజులు పాటూ జరిగే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో 2324 మంది ఓటు హక్కు వినియోగించుకో వాల్సి ఉంది. తొలిరోజు ఆదివారం పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లు 1489 మందికి గాను 1219 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండో రోజు సోమవారం పోలీసులు, ఇతర జిల్లాల్లో విధులు నిర్వహించే వారు 645 మంది, మూడో రోజు మంగళ వారం అత్యవసర సర్వీసులు, డ్రైవర్లు, ఫోటో కెమెరామెన్లు, క్లీనర్లు 190 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

# ఫ్యాన్ ప్రభంజనం... కూటమి భూస్థాపితం

- ప్రజాదరణే జగనన్నకు ఆశీర్వాదం
- పట్టణ వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టిన మంత్రి అంబటి రాంబాబు
- 31వార్డుల్లో కలియదిరుగుతూ.. ప్రజలతో మమేకమై
- ఈ ఎన్నికలు నాకు రెఫరెండం : అంబటి



పట్టణంలో ప్రజలకు అభివాదం చేస్తూ పాదయాత్రలో మంత్రి అంబటి రాంబాబు, ఆయన తనయ

**సత్తెనపల్లి:** రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం దెబ్బకు కూటమి పార్టీలు భూస్థాపితం అవ్వటం ఖాయమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు అన్నారు. పట్టణ వ్యాప్తంగా ఎన్నికల ప్రచార పాదయాత్రను ఆయన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటో వార్డులోని రామాలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరావు గజమాలతో మంత్రి అంబటి రాంబాబు, విజయలక్ష్మి దంపతులను సత్కరించి, పాదయాత్ర ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు.

**పాదయాత్ర సాగిందిలా..**

పట్టణంలోని ఒకటో వార్డు రామాలయం వద్ద నుంచి ఎన్నికల ప్రచార పాదయాత్ర ప్రారంభమై 30వ వార్డుకు చేరుకోగా వార్డ్ ఇన్‌చార్జ్ ఉల్లంఘుల విజయలక్ష్మి దిష్టితీసి పూలమాలలు,దుశ్శాలువాతో సత్కరించారు. అక్కడి నుంచి 31వ వార్డు శ్రేణులతో రెండో వార్డు నుంచి మూడో వార్డులో ప్రాథమిక పాఠశాల మీదుగా ఆరో వార్డ్ లోకి ప్రవేశించారు. పాత గజ్జల వైద్యశాల వద్ద 7, 8, 9,10 వార్డుల ప్రజలు మంత్రి అంబటి రాంబాబు పాదయాత్రకి స్వాగతం పలికారు. అక్కడి నుంచి 5, 4 వార్డులను కలువుతూ 28వ వార్డు మీదుగా 25వ వార్డు శివాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం 27,28,29 వార్డుల ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. అక్కడి నుంచి నాగన్నకుంట చేరుకోగానే 24,23,22 వార్డుల మహిళలు విశేషంగా తరలివచ్చారు. 19వ వార్డు లో ఎస్సీ నాయకులు తప్పెట్ల తో మంత్రి అంబటి రాంబాబుకు ఘన స్వాగతం పలికారు. వైఎస్ఆర్ విగ్రహం వద్దకు 21వ వార్డు స్థానికులు పాదయాత్ర బృందానికి హారతితో స్వాగతించారు. అనంతరం 20,18 వార్డులను దాటి రాగా గచ్చుబావి వద్ద 17,15,16 వార్డుల ప్రజలు ఎదురేగి మంత్రి అంబటి రాంబాబు వెంట నడిచారు. అక్కడి నుంచి 13,16 వార్డు నాయకులు జతకట్టారు. 12వ వార్డులో వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద కు రాగా స్థానిక వార్డు ప్రజలతో 11,12వ వార్డు వారు కలిశారు. 12వ వార్డు కౌన్సిలర్ లోకా కళ్యాణి, లోకా మాధవలు దిష్టి తీసి మంత్రి అంబటి రాంబాబును సత్కరించారు అక్కడి నుంచి కృష్ణవేణి జూనియర్ కళాశాల మీదుగా 13వ వార్డులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయానికి చేరడంతో పాదయాత్ర ముగిసింది. ఆద్యంతం అంబటి పాదయాత్రకు అడుగడుగునా బ్రహ్మ రథం పట్టారు.

**ఈ ఎన్నికలు నాకు రెఫరెండం**

ఈ ఎన్నికలు నా పరిపాలనకు రెఫరెండం గా భావిస్తు న్నానని మంత్రి అంబటి రాంబాబు ప్రకటించారు. ఐదేళ్ల కాలంలో తన నియోజక వర్గంలో రాజకీయ వేధింపులు లేని పాలన అందించానన్నారు. ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించానని అంబటి గుర్తు చేశారు.

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి 58 నెల పాలనలో ఎన్నడూ లేని విధంగా ప్రతి ఇంటికి పారదర్శకంగా సంక్షేమం అందించారన్నారు. చంద్రబాబునాయుడు కూటమి కుట్ర పూరిత ప్రచారాలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. జగనన్న చేసిన సుపరిపాలన కొనసాగించాలంటే ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేయాలని అభ్యర్థించారు.

పాదయాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆయన ధన్య వాదాలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లం చర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి, పక్కాల సూరిబాబు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహసంతి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, పట్టణ, రూరల్, రాజుపాలెం మండలాల మండల పార్టీ అధ్యక్షులు సహారా మౌలాలి, రాయపాటి పురుషోత్తమరావు, వేపూరి శ్రీనివాస రావు, తెలగ సంఘం అధ్యక్షుడు ఆకుల శివయ్య, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, వైఎఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.



అంబటికి కిరీటం పెడుతున్న ఉల్లంఘుల విజయలక్ష్మి

### బాలభాను విద్యార్థుల ప్రతిభ

**కారెంపూడి:** స్థానిక బాలభాను విద్యార్థులు ఏడుగురు కారెంపూడి మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి ఆరవ తరగతి ప్రవేశానికి ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం మహాలక్ష్మి తెలిపారు. విద్యార్థిని వేముల జ్యోత్స్న మూడవ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. మాస్టర్ ఈకే స్వచ్ఛంద ఆధ్వర్యంలో ప్రభుత్వ గుర్తింపుతో ప్రాథమిక పాఠశాల నడుస్తోంది. ప్రతి ఏటా స్థానిక ఆదర్శ పాఠశాలతో పాటు ఇతర రెసిడెన్సియల్ పాఠశాలలో ప్రవేశం పొందేలా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయినులను సంస్థ నిర్వాహకులు సీహెచ్ శివానందం, విష్ణుప్రియ అభినందించారు.

## నాన్నకు ప్రేమతో..

# ప్రచారంలో తనయలు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే నంబూరుశంకరరావు కుమార్తెలు
- ఊటుకూరులో ప్రజలను అభ్యర్థిస్తూ

**ఊటుకూరు(క్రోసూరు):** ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కుమార్తెలు తులసిరమా, శ్రీవల్లి కుటుంబ సభ్యులతో కలిసి జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. తండ్రి నంబూరు శంకరరావుకు మద్దతుగా గ్రామగ్రామాన పర్యటిస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు. ఇందులో భాగంగా ఊటుకూరులో ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. మరోసారి ఎమ్మెల్యే నంబూరు శంకరరావును, ఎంపీ అభ్యర్థి పి. అనిల్‌కుమార్ యాదవ్‌లను గెలిపించాలన్నారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అభివృద్ధి కావాలంటే నాన్నను గెలిపించాలంటూ వారు ప్రజలను అభ్యర్థించారు. వారి వెంట గ్రామపార్టీనాయకులు పాల్గొన్నారు.



ఊటుకూరు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే నంబూరుశంకరరావు కుమార్తెలు తులసిరమా, శ్రీవల్లి

## వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమొస్తే సంక్షేమ పథకాలన్నీ మీ ఇంటికే

- మాదలలో మంత్రి అంబటి, ఎంపీ అభ్యర్థి
- అనిల్‌కుమార్‌యాదవ్ ఎన్నికల ప్రచారం

**ముప్పాళ్ల :** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలన్నీ ఇంటికే వచ్చి చేరుతాయని మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. మండలంలోని మాదలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఘనస్వాగతం పలికారు. దిష్టి తీసి, హారతులిచ్చారు. నాయకులు, కార్యకర్తలు గజమాలతో మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ లను గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రచార వాహనంపై నుంచి వారు మాట్లాడుతూ ఒక్క బటన్‌తో సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇంటికే చేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కుల, మత,, పార్టీలకతీతంగా పథకాలు అందించిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ పెండెం బాబూరావు, వైస్ చైర్మన్ కళ్ళం శివరామిరెడ్డి, మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, ఎం.జె.ఎం.రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వర రెడ్డి, నర్సిహారెడ్డి, సైదా, కానాల పుల్లారెడ్డి, గోగుల అంజిబాబు, చిమటా శ్రీనివాసరావు, గంజి శ్రీనివాస రావు, యువజనవిభాగం అధ్యక్షుడు సుభాని, యనమల శింగయ్య తదితరులు పాల్గొన్నారు.



మంత్రి అంబటి, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్‌లను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

# ప్రగతి పథాన నడుద్దాం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు. పిలుపు
- ఆవులవారిపాలెంలో ఎన్నికల ప్రచారం

**ఆవులవారిపాలెం(క్రోసూరు):** ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేసి, నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిద్దామని ఎమ్మెల్యే నంబూరు శంకర రావు పిలుపునిచ్చారు. క్రోసూరు మండలం ఆవులవారిపాలెంలో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు బాణాసంచా మోతలు, పూలతో ఘనస్వాగతం పలికారు. పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో తన వంతు కృషి చేశానన్నారు. గత 30 ఏళ్లలో ఎవరూ చేయలేని అభివృద్ధి తాను చేసి చూపించానన్నారు. ఐదేళ్లలో ఎవరూ ఊహించని రీతిలో నియోజకవర్గాన్ని ప్రగతి పథాన నడిపించి చూపించామన్నారు. అభివృద్ధి జరగలేదంటున్న ప్రతిపక్షాలు 2014–19 లో ఏం చేశారో చెప్పాలంటూ ప్రజలు నిలదీయాలన్నారు. 2019 నుంచి ఇప్పటివరకు తాము ఏం చేశామో చెప్పే ధైర్యం తమకుందన్నారు. ఆ ధైర్యంతోనే ఇంటింటికి వెళ్లి ఓటు అడగగలుగుతున్నామన్నారు. ముఖ్యమంత్రి పేదల కోసం 125 సార్లు బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రజలందరూ ఇప్పుడు కేవలం రెండుసార్లు బటన్ నొక్కి రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందన్నారు. ఒకటి తనకు, మరో ఓటు ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్‌కు ఫ్యాను గుర్తుపై వేసి విజయమందించాలని అభ్యర్థించారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తిరునాళ్ల మహోత్సవం

హాజరైన మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ అభ్యర్థి డా.పి.అనిల్‌కుమార్‌యాదవ్.

**చాగంటివారిపాలెం(ముప్పాళ్ల):** చాగంటివారి పాలెంలో ఆదివారం నీలంపాటి అ మ్మవారి వార్షికోత్సవం, లింగమయ్యస్వామి తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులు అశేషంగా పాల్గొని పొంగళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్‌సీపీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌లు హాజరై అమ్మవారికి, లింగమయ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కాశ్రీనివాసరావు, ఎం.జేఎం.రామలింగారెడ్డి, అన్నపురెడ్డిసాయిరెడ్డి, రెండె ద్దులవెంకటరెడ్డి, లీలా లక్ష్మయ్య, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో నరసారావుపేట ఎంపీ అభ్యర్థి డా.అనిల్‌కుమార్‌యాదవ్

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి...

చంద్రాజుపాలెంలో ఎమ్మెల్యే నంబూరు ప్రచారం

**బెల్లంకొండ:** ఐదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి చూసి మాత్రమే ఓటెయ్యండంటూ ఎమ్మెల్యే, పెదకూరపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెంలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.గ్రామస్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. బాణసంచాతో.. పూల వర్షం కురిపిస్తూ అభిమానాన్ని చూపించారు. వందలాదిగా తరలివచ్చిన గ్రామస్తులు ఎమ్మెల్యేకు తమ మద్దతు తెలిపారు. మళ్లీ జగన్ సీఎం కావాలని.. ఎమ్మెల్యేగా మీరే గెలవాలంటూ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ సహకారంతో అన్ని గ్రామంలో సచివాలయం, సీసీ రోడ్లు నిర్మించామన్నారు. నాడు నేడు ద్వారా పాఠశాలలు బాగు చేశామన్నారు. ఇంటింటికి కుళాయిల ద్వారా సురక్షిత తాగునీటిని అందించేందుకు జలజీవన్ మిషన్ పనులు చేపడుతున్నామన్నారు. నిన్నటివరకు వాలంటీర్లను తిట్టిన చంద్రబాబు ఇప్పుడు వారికి జీతాలు పెంచుతామని చెబుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పొరపాటున చంద్రబాబుకు అవకాశమిస్తే జన్మభూమి కమిటీల అరాచకాలు మళ్లీ మొదలవుతాయని..ప్రజలు జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీఎంగా ఐదేళ్లలో రాజధాని ప్రాంతంలో ఒక్క కంపెనీ తీసుకు రాని చంద్రబాబు.. ఇప్పుడు పెదకూరపాడులో ఐటీ కంపెనీ తెస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, జడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఓర్సు సాంబశివరావు, మండల జేసీఎస్ కన్వీనర్ గాదె మిల్లు వెంకటరెడ్డి, సర్పంచ్ కొడవటి కరీముల్లా బాబూజీ, ఎంపీటీసీ మాదాసు రాంబాబు, వేల్పుల కోటేశ్వరరావు, రామకృష్ణ, సుబ్బయ్య, తురకా కొండలు తదితరులు పాల్గొన్నారు.



చంద్రాజుపాలెంలో ప్రచార రథంపైనుంచి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

## గెలిపించే పూచీ మీది..అభివృద్ధి బాధ్యత నాది

- పాటిబండ్లలో నంబూరు శంకరరావు ప్రచారం
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు

**పెదకూరపాడు:** ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ బాటలో నిలిపిన తనను గెలిపించే బాధ్యత ప్రజలదేనని పెదకూరపాడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. పాటిబండ్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భారీ సంఖ్యలో మహిళలు, వృద్ధులు, యువకులు నంబూరుకు ఘన స్వాగతం పలికారు. 2019 లో రోడ్లు అస్తవ్యస్తంగా ఉండేవని, నేడు అన్ని గ్రామాలకు రాచబాటలు వేయడం జరిగిందని గుర్తు చేశారు. అభివృద్ధి చేశాను కాబట్టే ధైర్యంగా మీ ముందుకు వచ్చి ఓటు అడుగుతున్నానన్నారు. మంచి చేసే వారికి ఓటు వేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. వైద్య శాలలు, విద్యాలయాలు, రోడ్లు, సామాజిక భవనాలు, దేవాలయాల్ని అభివృద్ధి చేసి చూపించానన్నారు. కూటమి నేతలు 2014 మాదిరి బూటకపు హామీలతో ముందుకు వస్తున్నారని వారి మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే నంబూరు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



పాటిబండ్లలో ప్రచారంలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న శంకరరావు

# టీడీపీ, జనసేనకు కోలుకోలేని దెబ్బ

- క్రోసూరు నుంచి 150, మరో 50 కుటుంబాలు వైసీపీలోకి..
- టీడీపీ,జనసేన పార్టీలకు 150కి పైై కుటుంబాల గుడ్ బై
- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో చేరిక



ఎమ్మెల్యే నంబూరుశంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు



పార్టీలో చేరినవారితో ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి

**క్రోసూరు:** టీడీపీ, జనసేనకు పెదకూరపాడు నియోజకవర్గంలో ఏదో చోట ఎదురుదెబ్బ తగులుతూనే ఉంది. ఆదివారం ఒక్కరోజు క్రోసూరు మండలానికి చెందిన 150 కి పైగా కుటుంబాలు టీడీపీ, జనసేన పార్టీలను వీడి వైఎస్సార్సీపీలో చేరాయి. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వీరంతా వైఎస్సార్‌సీపీ బాట పట్టారు. క్రోసూరులో టౌన్ నుంచి సుమారు 70 కుటుంబాలు, దొడ్లేరులో 50కి పైగా కుటుంబాలు తెలుగుదేశంపార్టీ కి గుడ్ బై చెప్పాయి. నాగవరంలో 20 కుటుంబాలు, ఊటుకూరులో 20 కుటుంబాలు, ఎర్రబాలెంలో 10 కుటుంబాలు, పెరికపాడులో మరో 20 కుటుంబాలు వైఎస్సార్సీపీలో చేరాయి.

**టిడిపి,ఎంఐఎం నాయకుల చేరిక**

**క్రోసూరు:** క్రోసూరు గ్రామానికి చెందిన టీడీపీ,ఎంఐఎం నాయకులు షేక్ జానీ ( టిడిపి సోషల్ మీడియా),షేక్ జాన్ సైదా,మహ్మద్ ఆరిఫ్(ఎంఐఎం) వైఎస్సార్సీపీలో ఆదివారం చేరారు. పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు నంబూరు శంకరరావు వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ఇటీవల టీడీపీలో చేరిన ఊటుకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త షేక్ మస్తాన్ (బుడే) తిరిగి పార్టీలోకి చేరాడు.

**ఎమ్మెల్యే నంబూరు సమక్షంలో**

వెంకటాయపాలెం గ్రామానికి చెందని టీడీపీ నా యకులు కారుమూరి కోటేశ్వరరావు, కోటయ్యలు ఆదివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**బెల్లంకొండ:** ఎమ్మాజీగూడెం, న్యూచిట్యాల గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఆదివారం ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మాజీగూడెం గ్రామానికి చెందిన శివంగుల శ్రీలక్ష్మీ, నాగ ప్రసన్న, రాజ్యలక్ష్మీ, శ్రీనివాస రావు, సుశీల, శివకుమారి, లక్ష్మీనారాయణ, సూరమ్మ, కూరాకుల పుల్లయ్య, నాగేంద్రం, వెంకటేశ్వర్లు, రమాదేవి, రాయపాటి పరిశుద్ధ వెంకటరమణ, విజయలక్ష్మీ వైఎస్సార్‌సీపీలో చేరారు. న్యూచిట్యాల గ్రామం నుంచి టీడీపీ కార్యకర్తలు మొగిలి నరసింహారావు, నాగరాజు, పవన్, గురులోతు నరసింహానాయక్, దత్తునాయక్ పార్టీలో చేరారు. మొత్తం 30 కుటుంబాల ప్రతినిధులను ఎంపీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షుడు ఓర్సు సాంబశివరావు, రెండు గ్రామాల పార్టీ నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

**టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి**

**అమరావతి:** మునగోడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. క్రోసూరు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో గ్రామానికి చెందిన పది టీడీపీ కుటుంబాల ప్రతినిధులు వైఎస్సార్‌సీపీ గూటికి చేరారు. గ్రామసర్పంచ్ బంకా విష్ణు, పార్టీ నాయకులు సైదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

**సత్తెనపల్లి:** జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. సత్తెనపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. పోస్టర్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివ శంకర్ మాట్లాడుతూ 5, 6,7 తేదీల్లో నిర్వహించే పీఓ, ఏపీఓ ఓటింగ్ ప్రక్రియకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఓపీఓ ఇతర శాఖలకు సంబంధించి సిబ్బంది ఏడో తేదీలోగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా సంబంధిత అధికారు లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎవరైనా మిగిలిపోతే 7,8 తేదీల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.



సత్తెనపల్లిలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఆర్వో మురళీకృష్ణ

**క్యూ కట్టిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు....**

నియోజకవర్గ కేంద్రమైన సత్తెనపల్లిలో నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ తొలి రోజు ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గానికి చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు వరుస కట్టారు. వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్వో వి.మురళీకృష్ణ అన్ని చర్యలు చేపట్టారు. 1,916 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు గాను తొలిరోజు 1,238 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆర్వో మురళీకృష్ణ తెలిపారు.

ఇంకా ఎవరైనా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోక పోతే వెంటనే చేసుకునే అవకాశం ఎన్నికల కమీషన్ కల్పించిందన్నారు. వారికి ఈ నెల 7,8 తేదీల్లో ఓటింగ్‌కు అవకాశం ఇస్తామన్నారు.

**పెదకూరపాడులో ...**

**పెదకూరపాడు:** పెదకూరపాడు జిల్లా పరిషత్ పాఠశాల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శివశంకర్ పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో పోస్టల్ ఓటింగ్ జరుగుతుందన్నారు. కాగా తొలిరోజు 964 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఓటు వేసేందుకు క్యూలైన్లులో కూర్చోన ఉద్యోగులు